# మహాప్రస్థానం

— ఎ.బి. చన్ద్ర

సత్తెయ్య అసలు పేరు అదికాదు.

కాని అందరూ అతన్ని అలానే పిలుస్తారు.

ఆ పిలుపుకి అలవాటు పడిపోయి అతను తన అసలు పేరును ఎప్పుడో మర్చిపోయాడు.

సత్తెయ్యకు అరవై యేళ్లు.

లోతుకుపోయిన కళ్ళు, ముందుకు పొడచుకొచ్చిన దవడ ఎముకలు, వంగి పోయిన శరీరానికి భిన్నంగా అతని కాళ్ళు, చేతులు దృఢంగా మాసం ముద్దలు కట్టినట్టు విచిత్రంగా వుంటాడు.

తనవాళ్ళందరూ ఎక్కడెక్కడో వున్నారంటాడు. కానీ అతనికోసం వాళ్ళెవరూ రారు. వాళ్ళ దగ్గరికి అతను ఎప్పుడూ వెళ్ళడు.

ఒంటరిగా వుంటాడు.

తన ఒంటరి జీవితం గడిచేందుకు అతను రిక్షా తొక్కుతాడు. అందులో విచిత్రం లేదు. విచిత్రమల్లా అతని రిక్షాలో ఎప్పుడూ ప్రాణమున్న మనిషు ల్నెక్కించుకోడు. నిర్జీవమైన శవాలే అతని కస్టమర్లు!

ఉస్మానియా హాస్పిటల్ ముందున్న పెద్దగేటు ప్రక్కనే రిక్షాపెట్టుకుని వోర్లో నొంతంగా చుట్టుకున్న చుట్టపెట్టుకుని పీలుస్తూ ఎటో చూస్తూ ఆలోచిస్తూ కూర్చుంటాడు.

హాస్పిటల్లో ఎవరో పోయారన్న వార్త వస్తుంది.

అతనికి పిలుపొస్తుంది.

ఏడుపులు, పెడ బొబ్బలు, ఆర్తనాదాలు, ముక్కు చీదుళ్ళ మధ్య నిర్వికారంగా శవాన్ని చేతుల్లోకి తీసుకుంటాడు. రిక్షాలో వేస్తాడు. హైద్రాబాద్ మొత్తంలో ఏ మూల ఇంటికైనా చేరుస్తాడు. అందుకు గాను అతనికి తగినట్టుగానే ముడుతుంది. ఒక్కోసారి ఏ శవమూ లేని రోజున అలాగే ఆలోచిస్తూ ఏ అరుగుమీదో పడుకుంటాడు.

శవాల్ని మాత్రమే ఎందుకు తీసుకెల్తావని ఎవరైనా అడిగితే కారణం చెప్పడు. నిశ్శబ్దంగా నవ్వుతాడు.

ఆ రోజు!

అతనికి మామూలుగానే పిలుపొచ్చింది. కాలుస్తున్న చుట్టముక్క ఆర్పి చెవిలో పెట్టి భుజం మీదున్న కండువాని తలకి చుట్టి లోనికి బయల్దేరాడు.

హాస్పిటలంతా మామూలుగా హడా వుడిగా వుంది. అతనికి ఏడుపులెక్కడా వినబడలేదు. అతనికి కబురు తెచ్చిన కుర్రాడు గబగబా నడుస్తున్నాడు

మార్చురీ రూము మంచి భయంకర మైన దుర్వాసన!

ఆ గదికి దూరంగా యిద్దరు మను ష్యులు. చూడగానే డాక్టర్లని గుర్తుపట్టి నమస్కారంపెట్టి చేతులు కట్టుకున్నాడు.

"సత్తెయ్యా గదిలో శవం వుందిరా! అనాథ! మనమే మట్టి చెయ్యాలి. పెద్దగా గిట్టుబాటవదనుకో! అయినా యిలాంటివి నీకూ, మాకూ తప్పవు!" అన్నాడు ఆ యిద్దర్లో ఒకతను

"అయ్యా! చిత్తం."

"దాన్ని తీసుకెళ్ళి పని కానించెయ్! యీ యిరవై వుంచు" అని రెండు పదుల నోట్లు చేతిలో పెట్టాడు.

సత్తెయ్య కదిలాడు. కుర్రాడు శవాన్ని చూపించాడు. ముక్కు రంధ్రాల్ని అదరగొట్టే వాసన!

ఎన్ని రోజులైందో పాపం! అనుకు న్నాడు సత్తెయ్య.

శవాన్ని లాగుతున్నపుడు అతనివళ్లు జలదరించింది. ఇన్నేళ్ళ అనుభవంలో అతని కెప్పుడూ అలా కాలేదు. నర నరాల్లో నీరసం ప్రవేశించినట్లయింది.

"కాస్త సాయం పట్టు" అన్నాడు.

"పురసత్ గైతే చేసెడిదిలేద్! నియ్యావ్వ పైసల్ నువ్వు తీస్కొని పని నన్నుజెయ్యమంటవ్"అర్చాడు కుర్రాడు

"నీకూ యిస్తాలే."

అప్పటికిగాని కుర్రాడు సాయానికి రాలేదు. ఒకపక్క దుర్వాసన! మరో ప్రక్క నీరసం! కాళ్ళు బలవంతంగా కదులుస్తున్నాడు సత్తెయ్య!

రిక్షాలో వేసాడు!

కుర్రాడొచ్చి చేతులు చాపాడు.

అయిదురూపాయలు చేతిలో పెట్టాడు. వాడేదో గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు. శవాన్ని పీల్ ఖానా అవతలికి తీసుకెళ్లాలి.

ఎంతో దూరం అనిపించింది సత్తెయ్యకి!

ఈరోజు ఎందుకిలా అవుతుంది తనకి! తనకీపని కొత్తకాదు. అయినా ఎందుకో భయమనిపించింది. రిక్షాలోంచి పాతగుడ్డని తీసి శవంమీద కప్పాడు. చెవిలోంచి చుట్టతీసి వెలిగించాడు.

రిక్షా కదిలింది బలంగా! అతి బలంగా! లాభంలేదు తనవల్ల కాదు! కాలు స్తున్న చుట్టని తుపుక్కున ఉమ్మేశాడు.

రిక్షాని రోడ్డువారగా నిలిపి ఇరుకిరుగ్గా వున్న సందుల్లోకి హడావుడిగా నడుస్తూ వెళ్ళాడు.

* * *

కార్యక్రమం పూర్తయ్యేసరికి సత్తె య్యకి ఒంటినిండా చెమటలు పట్టాయి- వచ్చే దారిలో రిక్షా ఆపి మళ్ళీ లోన కెళ్ళాడు.

"ఏంటి సత్తియ్యన్నా! మళ్ళొచ్చి నావు" అన్నాడొకడు.

"ఏందోరా! ఎన్నడూలేంది యియ్యా

లింత బేజారుగుంది. రెండౌన్సులిచ్చెయ్" అన్నాడు కింద చతికిలబడుతూ.

డ్రమ్ములోంచి సారాని గ్లాసులోకి కొలత ప్రకారం నింపి పత్తెయ్యకి ఇచ్చాడు. కళ్ళుమూసుకుని గట గటా తాగేసాడు పత్తెయ్య.

పంచెలో దోపిన పదిరూపాయిలిచ్చి చిల్లర తీసుకున్నాడు.

మళ్ళీ హాస్పిటల్ గేటుదగ్గర చుట్ట కాలుస్తూ కూర్చున్నాడు.

ఉన్నట్టుండి అతనికి కడుపులో తిప్పినట్టయింది. తలంతా భారంగా తయారైంది. రిక్షా దిగేలోపునే పెద్దగా వాంతి చేసుకున్నాడు.

నరాలు మెలిపెట్టే బాధ.

మున్పయ్యేళ్ళ క్రితం తన భార్య మరొకడితో లేచిపోయినప్పుడు కలిగిన బాధలాంటి బాధ.

ఇన్నేళ్ళ తర్వాత అనాథగా దిక్కుమాలిన శవంలా కన్పించిన భార్యను తలుచుకున్నకొద్దీ పెరిగే బాధ.

మరోసారి పెద్దవాంతి చేసుకున్నాడు.

కళ్ళు బైర్లుకమ్ముతున్నాయి- నగరంలో వున్న సారాదుకాణాలు ప్రభుత్వ పాలసీలు, సారా కాంట్రాక్టర్ల నాటకాలు అన్నీ కళ్ళలో కదుల్తున్నట్టున్నాయి.

నాటుసారా! కల్తీసారా!...

ఎలక్షన్ల రోజున పవిత్ర గంగాజలంలా ప్రవహించి ప్రజాస్వామ్యాన్ని ప్రక్షాళనం చేస్తున్న దృశ్యం కనిపిస్తోంది.

అతను మెల్లగా నవ్వాడు. రిక్షాలో ఒరిగాడు.

అతని రిక్షా తొక్కే వారికోసం ఎదురు చూస్తోంది. ●

